క్లుప్తంగా

సీఎంను కలిసిన ఎమ్మెల్సీ



నెల్లూరు (టౌన్): తాడేపల్లిలోని క్యాంప్ కార్యాలయంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, ఏపీజీఈఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కాకర్ల వెంకటరామిరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఎంను సత్కరించారు.

న్యూరాలజీ విభాగం ప్రారంభం



నెల్లూరు సిటీ: నగరంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో న్యూరాలజీ విభాగాన్ని జీజీహెచ్ సూపరింటెండెంట్ సిద్ధానాయక్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి మంగళ, శుక్రవారాల్లో ఓపీలు ఉంటాయని, ఇద్దరు న్యూరాలజీ డాక్టర్లు, ఇద్దరు న్యూరో సర్జన్లు, ఇద్దరు యూరాలజీ డాక్టర్లు, ఒక సర్జికల్ అంకాలజీ డాక్టర్ అందుబాటులో ఉంటారని తెలిపారు. ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు రూమ్ నంబర్ – 12లో వైద్యసేవలను అందించనున్నామని వివరించారు. కార్డియాలజీ, నెఫ్రాలజీ విభాగాలను త్వరలో ఏర్పాటు చేయనున్నామని వెల్లడించారు. ప్రిన్సిపల్ డాక్టర్ వసుంధర తదితరులు పాల్గొన్నారు.

సమస్యలకు సత్వర పరిష్కారం



నెల్లూరు(క్రైమ్): సమస్యలను సత్వరమే పరిష్కరిస్తామని ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి పేర్కొన్నారు. నగరంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్ వెల్ఫేర్ డేను శుక్రవారం నిర్వహించారు. డిజర్షన్ తొలగించాలని, ప్రమోషన్లు, బదిలీలు, సర్వీస్ సంబంధిత సమస్యలు, గ్రేడ్ ఇంక్రిమెంట్, డిప్యుటేషన్, భద్రత, హౌసింగ్ లోన్ తదితర సమస్యలను ఎస్పీ దృష్టికి పలువురు సిబ్బంది తీసుకెళ్లారు. పరిష్కారానికి చర్యలు చేపడతామని ఆయన హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడారు. క్రమశిక్షణతో విధులు నిర్వర్తించాలని, అనధికారికంగా గైర్హాజరైతే చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): రామ్మూర్తినగర్ సబ్‌స్టేషన్లో మరమ్మతుల కారణంగా పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా శనివారం ఉండదని నెల్లూరు టౌన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సోమశేఖర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రామ్మూర్తినగర్, శ్రీనివాసాగ్రహారం, రామలింగాపురం తదితర ప్రాంతాల్లో ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు సరఫరా ఉండదని చెప్పారు.

'నమస్తే'ను సద్వినియోగం చేసుకోండి

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ పరిధిలోని మురుగు శుభ్రపర్చే కార్మికులు, సెప్టిక్ ట్యాంక్ డ్రైవర్లు, హెల్పర్లు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నేషనల్ యాక్షన్ ఫర్ మెకనైజ్డ్ శానిటేషన్ ఎకో సిస్టమ్ (నమస్తే) పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కార్పొరేషన్ నోడల్ అధికారి చంద్రయ్య శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. నగరపాలక సంస్థ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో ప్రత్యేక క్యాంపును ఫిబ్రవరి 21వ తేదీ ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు నిర్వహించనున్నామని చెప్పారు. ఆధార్, రేషన్ కార్డు.. ఏదైనా సంస్థలో పనిచేస్తున్న గుర్తింపు కార్డు, కుటుంబసభ్యుల వివరాలు, ఆదాయ సర్టిఫికెట్ నకళ్లను సమర్పించి నమోదు చేసుకోవాలని కోరారు. ఈ పథకంలో నమోదైన వారికి ప్రభుత్వం నుంచి ప్రత్యేక సదుపాయాలు అందుతాయని చెప్పారు.

వ్యభిచార కేంద్రంపై దాడి

నెల్లూరు రూరల్: వ్యభిచార కేంద్రంపై రూరల్ పోలీసులు దాడులను శుక్రవారం సాయంత్రం జరిపారు. పోలీసుల వివరాల మేరకు.. పార్థసారథినగర్‌లో ఓ ఇంటిని శైలజ అద్దెకు తీసుకొని వ్యభిచార కేంద్రాన్ని నిర్వహించసాగారు. సమాచారం అందుకున్న రూరల్ సీఐ సుబ్బారావు నేతృత్వంలో పోలీసులు దాడులు చేశారు. ఓ విటుడ్ని అదుపులోని తీసుకొని.. యువతులను హోమ్‌కు తరలించారు. నిర్వాహకురాలు పరారీలో ఉన్నారని సమాచారం. రూరల్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

భక్తిశ్రద్ధలతో రథసప్తమి

నెల్లూరు(బారకాసు): నగరంలోని పలు ఆలయాల్లో రథసప్తమిని భక్తిశ్రద్ధలతో శుక్రవారం నిర్వహించారు. తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో విశేష పూజలు చేశారు. రథసప్తమి సందర్భంగా సూర్యప్రభ, గరుడ, సింహ, హంస, బంగారు తిరుచ్చి, పెద్దశేష, చంద్రప్రభ వాహనాలపై రంగడు విహరించారు. డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్, దేవస్థాన చైర్మన్ మంచికంటి శ్రీనివాసులు, ఈఓ డబ్బుగుంట వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

- మూలాపేటలోని భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరస్వామి దేవస్థానంలో సూర్య భగవానుడికి విశేషాభిషేకాలు చేశారు. స్వామివారిని వివిధ పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. ఈ సందర్భంగా అష్టోత్తర శతనామావళిని శ్రీముకుంద గీత భక్తమండలి ఆధ్వర్యంలో నిర్వహించారు.
- సంతపేటలోని ఆంజనేయస్వామి దేవస్థానంలో స్వామివారిని ఊరేగించారు. ఉభయకర్తలుగా దరిశి శరత్, పార్వతి దంపతులు వ్యవహరించారు. ఆలయ చైర్మన్ సతీష్‌కుమార్, ఈఓ దర్గయ్య, కొణిదెల సుధీర్, శ్రీకాంత్, రవి, రజిని, రాధిక తదితరులు పాల్గొన్నారు.
- అయ్యప్పస్వామి దేవస్థానంలోని గురువాయూర్ మహావిష్ణు ఆలయంలో ఆదిత్య సేవను నిర్వహించారు.



సూర్యప్రభ వాహనంపై విహరిస్తున్న రంగనాథుడు

- సూర్యారాధనకు ఎంతో విశిష్టత ఉందని.. భూమిపై జీవరాశులు సుభిక్షంగా ఉంటున్నాయంటే అందుకు కారణం సూర్యుడేనని మైసూరు దత్తపీఠ ఉత్తరాధీశ్వరులు దత్త విజయానందతీర్థ అనుగ్రహభాషణ చేశారు. సుజాతమ్మకాలనీలోని అవధూత దత్తపీఠం, నెల్లూరు శాఖకు చెందిన కృష్ణయోగ, అష్టలక్ష్మి మందిరంలో రథసప్తమి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తొలుత సూర్యనారాయణుడికి పూజలు చేసి భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. అనంతరం శ్రీచక్రార్చన, హోమాన్ని నిర్వహించారు. ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ డాక్టర్ సర్వేపల్లి అజయ్‌కుమార్, ట్రస్టీలు అనపల్లి మస్తాన్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, ప్రమీలమ్మ, రేబాల పట్టాభిరామిరెడ్డి, రత్నం, రాజశేఖర్, ప్రవీణ్‌కృష్ణ, కొల్లం సురేష్ తదితరులు పాల్గొన్నారు.
- వేదాయపాళెంలోని మహాత్మాగాంధీనగర్‌లో గల కృష్ణ మందిరంలో రుక్మిణి, సత్యభామ సమేత కృష్ణుడ్ని విశేషంగా అలంకరించారు. నవగ్రహ, విఘ్నేశ్వర పూజలు చేశారు. సూర్యనారాయణ జీవిత చరిత్ర ప్రవచనంతో పాటు ధ్యానాన్ని సాయంత్రం జరిపారు.

నెల్లూరు రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రమైన నరసింహకొండపై వెలసిన వేదగిరి లక్ష్మీనరసింహ



కృష్ణ మందిరంలో..

స్వామి ఆలయంలో స్వామి, ఆదిలక్ష్మి అమ్మవారికి విశేష పూజలు చేశారు. పుష్పాలతో విశేషంగా అలంకరించారు. సూర్యప్రభ వాహనంపై లక్ష్మీ నృసింహుడు కొలువుదీరారు. ఆలయ చైర్మన్ వేమిరెడ్డి సురేంద్రరెడ్డి, ఈఓ గిరికృష్ణ పాల్గొన్నారు.

- 29వ డివిజన్లోని కోదండరామస్వామి ఆలయ ప్రాంగణంలో సూర్య నమస్కారాలు చేశారు. స్వామివారిని విశేషంగా అలంకరించి నగరోత్సవాన్ని నిర్వహించారు. ఉభయకర్తలుగా రామరావు, రామకోటేశ్వరి దంపతులు వ్యవహరించారు. ఆలయ కమిటీ చైర్మన్ వీరాస్వామి, యోగా గురువు పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.



నరసింహకొండలో..



కోదండరామస్వామి ఆలయంలో..



రంగడ్ని దర్శించుకుంటున్న భక్తులు



పారాయణం చేస్తున్న దత్త విజయానందతీర్థ



సంతపేటలోని ఆంజనేయస్వామి ఆలయంలో..

కుంభాభిషేక మహోత్సవాలకు అంకురార్పణ

నెల్లూరు రూరల్: కనుపర్తిపాడులో కొలువైన వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో పుష్కర కుంభాభిషేక మహోత్సవాలకు అంకురార్పణను శుక్రవారం నిర్వహించారు. వేదపారాయణం, మహాగణపతి పూజ, పుణ్యాహవచనం, గోపూజను జరిపారు. గ్రామంలోని దత్తాత్రేయ మందిరం నుంచి వేదమంత్రాలు, మేళతాళాలతో కలశాలను ఆలయానికి ఊరేగింపుగా తీసుకొచ్చారు. కలశంలోని జలాలతో స్వామివారికి అభిషేకించారు. ఆలయ



కలశాలతో ఊరేగింపుగా వస్తున్న భక్తులు

వ్యవస్థాపక ధర్మకర్త వెందోటి చంద్రశేఖర్‌రెడ్డి పర్యవేక్షించారు.

ఇళ్ల పట్టాల పంపిణీ

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని సీఆర్పీ డొంక ప్రాంతానికి చెందిన 124 మంది లబ్ధిదారులకు పట్టాలను ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు నగర నియోజకవర్గ సమన్వయకర్త, డిప్యూటీ మేయర్ ఖలీల్ అహ్మద్ శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇచ్చిన మాట మేరకు కాలువ గట్లపై నివసిస్తున్న కుటుంబాలకు ఇళ్ల పట్టాలను పంపిణీ చేస్తున్నామని వివరించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఎప్పుడూ అండగా ఉంటుందని, రానున్న ఎన్నికల్లో పార్టీని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్పొరేటర్లు మొగళ్లపల్లి కామాక్షిదేవి,



పంపిణీ చేస్తున్న ఖలీల్ అహ్మద్

కిన్నెర ప్రేమ్‌కుమార్, నేతలు దొంతాల రఘు, కిన్నెర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కోలాహలంగా సూర్య నమస్కారాలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): రథసప్తమిని పురస్కరించుకొని నగరంలోని జీవీఆర్ఆర్ కళాశాల ఆవరణలో సామూహిక సూర్యనమస్కారాల కార్యక్రమాన్ని యోగా మిత్రమండలి, ఆరోగ్య భారతి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమానికి 400 మంది హాజరయ్యారు. అనంతరం జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులకు ప్రశంసపత్రాలను అందజేశారు. బయ్యా రవికుమార్, యోగా గురువు నజీర్‌బాషా, యోగా మిత్రమండలి అధ్యక్షుడు బసిరెడ్డి విజయకుమార్‌రెడ్డి, కార్యదర్శి రవీంద్ర, పెంచలయ్య, చంద్రశేఖర్,



అనిల్, మహేష్, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన యువకుడి మృతి

నెల్లూరు(క్రైమ్): ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల సమాచారం మేరకు.. ప్లంబింగ్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న సంజయ్‌గాంధీనగర్‌కు చెందిన అనిల్(29) అవివాహితుడు. వ్యసనాలకు బానిసవ్వడంతో అనారోగ్యానికి గురయ్యారు. తీవ్ర కడుపునొప్పి, వాంతులతో చికిత్స నిమిత్తం జీజీహెచ్‌లో ఇటీవల చేరారు. కుదుటపడని ఆరోగ్యం.. మరోవైపు వివాహం కాలేదనే మనస్తాపంతో ఆస్పత్రిలోని బాత్‌రూమ్‌లో గడ్డి మందును బుధవారం సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ఈ క్రమంలో ఆస్పత్రిలోనే చికిత్స పొందుతూ గురువారం మృతి చెందారు. ఈ మేరకు దర్గామిట్ట పోలీసులకు మృతుడి కుటుంబసభ్యులు ఫిర్యాదు చేశారు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో భరోసా

నెల్లూరు రూరల్: జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రజలకు పూర్తిస్థాయిలో ఆరోగ్య భరోసా లభిస్తుందని రూరల్ ఎంపీపీ బూడిద విజయకుమార్ పేర్కొన్నారు. ఆమంచర్లలోని జెడ్పీ హైస్కూల్లో శుక్రవారం నిర్వహించిన రెండో విడత ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వైద్య పరీక్షలను సౌత్‌మోపూరు పీహెచ్‌సీ వైద్యుడు రవీంద్రనాథ్ నిర్వహించారు. అవసరమైన వారికి మందుల కిట్లను అందజేశారు. రూరల్ ఇన్‌చార్జి ఎంపీడీఓ శైలేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.



మందుల కిట్ల పంపిణీ

గిరిజన కుటుంబానికి ఆర్థిక సాయం

నెల్లూరు(బారకాసు): వావిలేటిపాడు గిరిజన కాలనీలో యాటగిరి పెంచలయ్య ఇటీవల మృతి చెందడంతో ఆయన భార్య సంజీవమ్మకు రూ.పది వేల ఆర్థిక సాయాన్ని మేయర్ స్రవంతి సహకారంతో శుక్రవారం అందజేశారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు జయవర్ధన్, వేణుగోపాల్‌రెడ్డి, రఘురామ్‌రెడ్డి, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పీఎం విశ్వకర్మ పథకంపై సెమినార్ నేడు

నెల్లూరు(దర్గామిట్ట): ప్రధాన మంత్రి విశ్వకర్మ పథకంపై సెమినార్‌ను ఏపీ టూరిజం హరిత హోటల్లో శనివారం ఉదయం 10.30కు నిర్వహించనున్నామని ఎమ్మెస్మెఈ కేంద్ర ప్రభుత్వ అసిస్టెంట్ డైరెక్టర్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. చేతివృత్తులు, హస్తకళల వారికి ఈ పథకంపై పలువురు ఉన్నతాధికారులు అవగాహన కల్పించనున్నారని వివరించారు.

ఉపాధ్యాయుల నిరసన

నెల్లూరు(వీఆర్సీసెంటర్): తమకు బకాయిలను వెంటనే చెల్లించాలని కోరుతూ వెంకటేశ్వరపురంలోని నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు శుక్రవారం భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలతో నిరసన చేపట్టారు. ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజమనోహర్, ఉపాధ్యాయులు ధనరాజ్, ఖాజారహంతుల్లా, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

పడారుపల్లిలో అన్నదానం

నెల్లూరు(బారకాసు): పడారుపల్లిలోని దివ్యాంగుల కాలనీలో గల పీసీ రెడ్డి సమాజ మందిరంలో అన్నదానాన్ని శుక్రవారం నిర్వహించారు. దొడ్ల కృష్ణారెడ్డి వర్ధంతిని పురస్కరించుకొని క్రాంతి మహిళా మండలి ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని చేపట్టారు. గుమ్మడి వెంకటలక్ష్మి, జేఎన్టీయూ విశ్రాంత ప్రొఫెసర్ ఈదూరు గోపీనాథ్‌రెడ్డి, శారదమ్మ, సుబ్బమ్మ, దగ్గుపాటి రాధాకృష్ణ, మల్లికార్జున, మాధవి తదితరులు పాల్గొన్నారు.

భారీ ర్యాలీ



నెల్లూరు(వీఆర్సీసెంటర్): రైతులకు మద్దతు ధర కోసం చేపట్టిన రైతాంగ గ్రామీణ బంద్‌లో భాగంగా నగరంలోని గాంధీబొమ్మ సెంటర్ నుంచి బీఎస్ఎన్ఎల్ కార్యాలయం వరకు ర్యాలీని శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం హాజరయ్యారు. సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అజయ్‌కుమార్, ఏఐటీయూసీ రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ వెంకటేశ్వర్లు, సాగర్, సీపీఎం, సీపీఐ జిల్లా కార్యదర్శులు మూలం రమేష్, దామా అంకయ్య, శంకర్ కిశోర్, శ్రీరాములు, పుల్లయ్య, షానవాజ్ తదితరులు పాల్గొన్నారు.



సీఎం సహాయనిధి చెక్కులను అందజేస్తున్న ఆదాల ప్రభాకర్‌రెడ్డి

ప్రజల ఆరోగ్య భద్రతకు పెద్దపీట

- ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు రూరల్: రాష్ట్ర ప్రజల ఆరోగ్య భద్రతే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. నియోజకవర్గంలోని 57 మందికి రూ.57.59 లక్షల మేర సీఎం సహాయనిధి చెక్కులను నగరంలోని తన నివాసంలో శుక్రవారం అందజేసిన అనంతరం ఆయన మాట్లాడారు. సీఎం సహాయనిధి చెక్కులను ఇటీవలి కాలంలో పెద్ద ఎత్తున అందజేశామని, మిగిలిన వారికి త్వరలో పంపిణీ చేయనున్నామని వివరించారు. వీటిని మంజూరు చేసిన సీఎం జగన్ మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలను తెలియజేశారు. వైద్య రంగానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందని చెప్పారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఆరోగ్యశ్రీ ద్వారా మెరుగైన వైద్యసేవలు అందుతున్నాయని చెప్పారు. మేయర్ స్రవంతి, విజయ డెయిరీ చైర్మన్ రంగారెడ్డి, పార్టీ నగరాధ్యక్షుడు సన్నపురెడ్డి పెంచలరెడ్డి, ఏఎంసీ చైర్మన్ కోటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్సీపీని మరోసారి ఆదరించండి



కోడూరుపాడులో ఎన్నికల ప్రచారంలో ఎంపీ ఆదాల

నెల్లూరు రూరల్: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని మరోసారి ఆదరించాలని ఎంపీ, పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి కోరారు. ఒకటో డివిజన్లోని కోడూరుపాడులో ఎన్నికల ప్రచారాన్ని శుక్రవారం ఆయన నిర్వహించారు. రథసప్తమి సందర్భంగా గ్రామంలోని గంగా పార్వతి సమేత నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను అందజేసి తనను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అన్ని వర్గాల సంక్షేమంతో పాటు ఆయా ప్రాంతాల అభివృద్ధికి భారీగా నిధులను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మంజూరు చేశారని చెప్పారు. ఆయన్ను మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. నియోజకవర్గంలో అరాచక పాలన సాగేదని, అయితే సమన్వయకర్తగా తాను బాధ్యతలు చేపట్టాక వీటిని అణిచేశామని తెలిపారు. టీడీపీ అధికారంలోకి వస్తే పథకాలు అందవని చెప్పారు. తొలుత ఎంపీకి స్థానిక నేతలు, కార్యకర్తలు అపూర్వ స్వాగతం పలికారు. గజమాలతో సత్కరించి మంగళహారతులిచ్చారు. మేయర్ స్రవంతి, విజయ డెయిరీ చైర్మన్ రంగారెడ్డి, మాజీ కార్పొరేటర్ లేబూరు పరమేశ్వరరెడ్డి, కార్పొరేటర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలను సాధించాలి

నెల్లూరు (టౌన్): పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలను సాధించి తల్లిదండ్రులు.. పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని డీఈఓ రామారావు పేర్కొన్నారు. బీవీనగర్‌లోని కేఎన్నార్ మున్సిపల్ స్కూల్లో పదో తరగతి విద్యార్థులతో కొద్దిసేపు శుక్రవారం ఆయన ముచ్చటించారు. పరీక్షలకు 30 రోజుల సమయమే ఉందని, యాక్షన్ ప్లాన్ మేరకు చదివి మంచి మార్కులను సాధించాలని కాంక్షించారు. ప్రధానోపాధ్యాయుడు విజయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్రీడా పోటీలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): యూనివర్సిటీ స్థాయిలో అధ్యాపకులకు క్రీడా పోటీలను నిర్వహించడం స్ఫూర్తిదాయకమని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి యతిరాజ్ పేర్కొన్నారు. విక్రమ సింహపురి యూనివర్సిటీ అంతర్ కళాశాలల అధ్యాపక పురుషుల విభాగ క్రీడా పోటీలను నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో కోలాహలంగా శుక్రవారం నిర్వహించారు. నెల్లూరు ప్రభుత్వ బీఈడీ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించిన ముగింపు కార్యక్రమంలో విజేతలకు బహుమతులను అందజేశారు.



విజేతలతో అధికారులు

టోర్నీ నిర్వహణ చైర్మన్, ప్రిన్సిపల్ వేణుగోపాల్, ఆర్గనైజింగ్ కార్యదర్శి, ఫిజికల్ డైరెక్టర్ రవీంద్రబాబు పాల్గొన్నారు.

డాక్టర్ సీవీ సుబ్రహ్మణ్యానికి ఆత్మీయ సత్కారం



నెల్లూరు(బారకాసు): పొగతోటలోని ఆదిశంకర ధ్యాన మందిరంలో ద్వారకా పీఠ వ్యవస్థాపక దినోత్సవాన్ని చక్రాల వారి ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ కమిటీ సభ్యుడిగా నియమితులైన ప్రముఖ వైద్యుడు సీవీ సుబ్రహ్మణ్యానికి ఆత్మీయ సత్కారం చేశారు. మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకు భారతరత్నను కేంద్రం ప్రకటించడంతో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. చీమకుర్తి వెంకటేశ్వరరావు, మందిర కమిటీ అధ్యక్షుడు పారా వెంకటశ్రీధరశర్మ, అన్నవరం సత్యనారాయణ, చక్రాల ఆనందకుమార్ పాల్గొన్నారు.

మార్కెట్లోకి బజాజ్ బైక్‌ల విడుదల

నెల్లూరు (టౌన్): నగరంలోని బజాజ్ షోరూమ్‌లో పల్సర్ ఎన్1 150 టీడీ, ఎన్ – 160 బైకులను మార్కెట్లోకి ఎమ్వీఐ బాలమురళీకృష్ణ విడుదల చేశారు. షోరూమ్ డీజీఎం, సేల్స్ మేనేజర్ శరవణ, మేనేజర్లు ప్రదీప్, మోజెస్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి మానవ హక్కుల కమిషన్ సభ్యురాలి పర్యటన

నెల్లూరు(దర్గామిట్ట): జాతీయ మానవ హక్కుల కమిషన్ సభ్యురాలు విజయభారతి జిల్లాలో శనివారం నుంచి పర్యటించనున్నారు. కలెక్టర్‌తో సోమవారం సమావేశం కానున్నారు. అనంతరం జిల్లాలోని ప్రభుత్వ సంస్థలను సందర్శించి, సాయంత్రం హైదరాబాద్ పయనమవ్వనున్నారు.

విధి ముందు ఓడిన ఆశయం

- సెల్‌ఫోన్ షోరూమ్ ప్రారంభానికి సర్వం సిద్ధం చేసుకొని..
- రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

నెల్లూరు రూరల్: తన కాళ్లపై తాను నిలదొక్కుకొని.. నలుగురికి ఉపాధి కల్పించాలనే ఉన్నతాశయంతో భారీ స్థాయిలో సెల్‌ఫోన్ షోరూమ్‌ను ఏర్పాటు చేయాలని యువకుడు సంకల్పించారు. షోరూమ్‌ను శుక్రవారం ప్రారంభించాల్సి ఉంది. ఈ క్రమంలో ఇంటీరియర్ డెకరేషన్ పనులను చేపట్టారు. అయితే విధి వక్రీకరించడంతో రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం పాలైన విషాద ఘటన నెల్లూరు – ముత్తుకూరు రోడ్డుపై బాబానగర్ సమీపంలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. వివరాలు.. కావలికి చెందిన బొడ్డు భార్గవ్ (28) ధనలక్ష్మీపురంలో సెల్‌ఫోన్ షోరూమ్‌ను ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేశారు. ఇంటీరియర్ డెకరేషన్ పనులను గురువారం చేపట్టారు. అనంతరం డెకరేషన్



పనులు చేసిన వ్యక్తిని నారాయణ ఆస్పత్రి సమీపంలోని ఓ ప్రాంతంలో వద్ద వదిలి తిరిగి ధనలక్ష్మీపురానికి బైక్‌పై బయల్దేరారు. ఈ క్రమంలో బైక్ అదుపుతప్పి పడిపోయి.. తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న 108 సిబ్బంది అక్కడికి చేరుకొని అప్పటికే మృతి చెందారని నిర్ధారించారు. రూరల్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని నెల్లూరు జీజీహెచ్‌కు తరలించి.. పోస్ట్‌మార్టం అనంతరం కుటుంబసభ్యులకు శుక్రవారం అప్పగించారు. రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.